- రెండు పిటిషన్ల దాఖలు
- రాష్ట్ర హక్కుల కోసం ఒకటి
- ఈడీ దాడుల అడ్డగింతకు మరొకటి

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేసింది. రాష్ట్రానికి రావాల్సిన విద్యా నిధులను కేంద్రం విడుదల చేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ ఒకటి.. టాస్మాక్ తనిఖీల వ్యవహారంలో ఈడీ విచారణ కొనసాగవచ్చంటూ మద్రాస్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మరొకటి దాఖలు చేసింది. ఈ రెండింటిపైనా త్వరలోనే విచారణ ప్రారంభం కానున్నట్లు సమాచారం.

\- చెన్నై, ఆంధ్రజ్యోతి

మళ్లీ సుప్రీం తలుపుతట్టిన రాష్ట్రం



విద్యా నిధుల కోసం...

సమగ్రశిక్షా పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.2,000 కోట్లకు పైగా నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని, వాటిని తక్షణం విడుదల చేసేలా ఆదేశించాలని అభ్యర్థిస్తూ రాష్ట్రప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ దాఖలుచేసింది. పీఎంశ్రీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు కేటాయించలేదని, జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020) ఆమోదిస్తేనే ఈ నిధులు కేటాయిస్తామని కేంద్రప్రభుత్వం చెబుతోందని పేర్కొంది. జాతీయ విద్యా విధానంలో త్రిభాషా విధానం ఉందని, కానీ, తమిళనాడులో ద్విభాషా విధానం మాత్రమే అమలు చేస్తున్నామన్నారు. పీఎంశ్రీ పాఠశాల పథకం రాష్ట్రంలో జాతీయ విద్యా విధానాన్ని పూర్తిగా అమలు చేయడం తప్పనిసరి చేస్తుందని, సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద నిధుల హక్కు రాష్ట్రానికి ఉన్నప్పటికీ కేంద్రం దాన్నిఅడ్డుకుంటోందని పేర్కొంది. విద్యకు నిధులు నిలిపివేయడమంటే విద్యకు సంబంధించి చట్టం చేసే రాష్ట్ర రాజ్యాంగ అధికారాన్ని హరించడమేననింది. రాష్ట్రంలో అమలవుతున్న విద్యా విధానాన్ని నిలిపివేసి, దాని స్థానంలో జాతీయ విద్యా విధానం అమలుచేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని, సమగ్ర శిక్షా అభియాన్ పథకంలో 2025-26వ సంవత్సరానికి తమిళనాడుకు కేటాయించాల్సిన రూ.2,151 కోట్లు విడుదల కాకపోవడం వల్ల పథకం అమలుపై తీవ్ర ప్రభావం పడిందని ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో 43,94,906 మంది విద్యార్థులు, 2,21,817 మంది ఉపాధ్యాయులు, 32,071 మంది ఉద్యోగులపై కూడా ఆర్థిక ప్రభావం పడిందని గుర్తు చేసింది. సమగ్ర శిక్షా అభియాన్ పథకంలో మొత్తం రూ.3,595.99 కోట్లు కేటాయించినా, అవి విడుదల చేయలేదనింది. ఈ నిధులు పొందే హక్కును జాతీయ విద్యా విధానం, పీఎంశ్రీతో అనుసంధానించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. న్యాయస్థానం నిర్ణయించిన నిర్దిష్ట వ్యవధిలోపు కేంద్రప్రభుత్వం ఈ ఏడాది మే 1 నుంచి ఈ ఉత్తర్వులు అమలయ్యే వరకు అసలు మొత్తంపై ఏడాదికి 6 శాతం వడ్డీతో రాష్ట్రానికి రూ.2,291 కోట్లు చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది.

టాస్మాక్ వ్యవహారంలో హైకోర్టు ఉత్తర్వుల సవాల్...

టాస్మాక్ కేసు విచారణ కొనసాగించవచ్చంటూ మద్రాసు హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. టాస్మాక్ సంస్థ మద్యం కొనుగోలు, విక్రయాలు, ఖాళీ బాటిళ్లకు సంబంధించి అవినీతి జరిగిందనే ఆరోపణల ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గత మార్చి నెలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, రూ.1,000 కోట్లకు పైగా అవినీతి వెలుగు చూసిందని తేల్చిన విషయం తెలిసిందే. ఈ తనిఖీలకు వ్యతిరేకంగా టాస్మాక్ సంస్థ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం మద్రాసు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వాటిని తోసిపుచ్చిన హైకోర్టు, నగదు అక్రమ బట్వాడా నిరోధక చట్టం కింద ఈడీ చర్యలు చేపట్టవచ్చని తేల్చింది. రాష్ట్రప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చిన అనంతరం, పలు ప్రాంతాల్లో ఈడీ మూడు రోజులు తనిఖీలు చేపట్టింది. అనంతరం ఈ నెల 16న టాస్మాక్ మేనేజింగ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి విశాఖన్ ఇల్లు, సినీ నిర్మాత ఆకాష్ భాస్కరన్, పారిశ్రామికవేత్త రత్తీష్ ఇళ్లు సహా 10 ప్రాంతాల్లో ఈడీ తనిఖీలు చేపట్టింది. అనంతరం విశాఖన్‌ను ఈడీ కార్యాలయానికి తీసుకెళ్లి 5 గంటలు విచారించింది. మరుసటిరోజు టాస్మాక్ జనరల్ మేనేజర్ జ్యోతిశంకర్‌ను కూడా విచారించింది.ఈ నేపథ్యంలో,టాస్మాక్ సంస్థలో తనిఖీలు చేపట్టవచ్చన్న హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తనిఖీల పేరుతో టాస్మాక్ అధికారులను వేధించారని, రాజకీయ కక్ష కారణంగా ఈ తనిఖీలు జరిగాయని పిటిషన్‌లో పేర్కొంది.

26న చెన్నైకి పవన్ కల్యాణ్



చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈనెల 26న చెన్నైకి రానున్నారు. స్థానిక తిరువాన్మియూరులో ఉన్న రామచంద్ర కన్వెన్షన్ హాలులో ఉదయం 10 గంటలకు వన్ నేషన్ వన్ ఎలక్షన్' అనే అంశంపై జరగనున్న సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా వన్ నేషన్ వన్ ఎలక్షన్ జాతీయ కన్వీనర్ అనిల్ కె.ఆంటొని, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, కో-కన్వీనర్లు ఆర్.అర్జునమూర్తి, నారాయణన్ తిరుపతి తదితరులు కూడా పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా జనసేనను స్థాపించాక పవన్‌కల్యాణ్ చెన్నై వచ్చి స్థానిక మీడియాతో సమావేశమయ్యారు. తన పార్టీ లక్ష్యాలు, పార్టీ స్థాపనకు గల కారణాలను వివరించి తనను తాను పరిచయం చేసుకున్నారు. అయితే ఉపముఖ్యమంత్రి అయ్యాక ఆయన చెన్నైకి రావడం ఇదే తొలిసారి కావడంతో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



పల్లావరంలో ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు

డ్రైవర్ల చాకచక్యంతో తప్పిన పెనుముప్పు

ప్యారీస్, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరంలో ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు ఆగిన ఘటన ప్రయాణికులను ఆందోళనకు గురిచేసింది. 15 నిమిషాల తర్వాత ఈ స్టేషన్‌కు రావల్సిన విద్యుత్ రైలు ముందుగానే రావడంతో ఈ సంఘటన జరిగినట్లు సమాచారం. రాజధాని నగరంతో పలు శివారు ప్రాంతాలను కలుపుతూ దక్షిణ రైల్వేశాఖ విద్యుత్ రైళ్లను నడుపుతోంది. చెన్నై రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో ప్రతిరోజు 600 పైగా విద్యుత్ రైళ్లను సెంట్రల్, బీచ్ రైల్వేస్టేషన్‌ల నుంచి తాంబరం, చెంగల్పట్టు, తిరువళ్లూరు, తిరుత్తణి, గుమ్మడిపూండి, సూళ్లూరుపేట తదితర ప్రాంతాలకు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, పల్లావరం రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు వచ్చి ఆగడం అక్కడున్న ప్రయాణికులను భయాందోళనకు గురిచేసింది. అయితే డ్రైవర్లు చాకచక్యంతో రైళ్లను వెంటనే నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. దీనిపై దక్షిణ రైల్వేశాఖ విచారణకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఘటనపై ప్రయాణికులు మాట్లాడుతూ, 15 నిమిషాల తర్వాత రావాల్సిన విద్యుత్ రైలు ముందుగానే వచ్చిందని, ఇలాంటి ఘటన జరగడం ఇది మొదటిసారి కాదని వ్యాఖ్యానించారు.

మెరీనా సముద్రంలో సుడిగుండం



- స్నానాలను నిషేధించిన పోలీసులు

ప్యారీస్, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్‌లోని నేపియర్ వంతెన నుంచి మైలాపూర్ పట్టినంబాక్కం వరకు ఉన్న మెరీనా సముద్రంలో 7 ప్రాంతాల్లో సుడిగుండాలు ఏర్పడ్డాయని, ఈ ప్రాంతాల్లో సముద్రంలో దిగి స్నానం చేయరాదని గ్రేటర్ చెన్నై పోలీస్ సంయుక్త కమిషనర్ విజయ్‌కుమార్ బుధవారం నగరవాసులు, పర్యాటకులను హెచ్చరించారు. ప్రపంచంలో సుందరమైన, పొడవైన రెండవదిగా పేరొందిన మెరీనా బీచ్ తీరంలో సేదతీరేందుకు నగరం నుండేకాక, శివారు ప్రాంతాలు, పలు రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు ప్రతిరోజు తరలివస్తుంటారు. సముద్రంలో దిగకుండా పోలీస్‌శాఖ భద్రతా ఏర్పాట్లను కల్పించి హెచ్చరిస్తున్నా.. పట్టించుకోని కొంతమంది మెరీనాలో స్నానాలకు దిగి అలల తాకిడికి గురై మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో, నేపియర్ బ్రిడ్జి నుంచి పట్టినంబాక్కం వరకు మెరీనా సముద్రతీరంలో ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గ్రేటర్ చెన్నై పోలీస్ సంయుక్త కమిషనర్ విజయ్‌కుమార్ పోలీసులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. మెరీనాలో ఏడు ప్రాంతాల్లో సుడిగుండం ఏర్పడిందని హెచ్చరిస్తూ చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం వల్ల మంచి ఫలితం ఉంటుందని స్థానిక మత్స్యకారులు అభిప్రాయం వ్యక్తంచేశారు.

వీసీల నియామకం




- కొత్త చట్టం అమలుపై హైకోర్టు స్టే

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి కల్పిస్తూ రూపొందించిన చట్టంలోని ఓ సెక్షన్‌పై మద్రాసు హైకోర్టు స్టే విధించింది. రాష్ట్రంలోని వర్శిటీలకు వీసీలను నియమించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికే కల్పించేలా తమిళనాడు ప్రభుత్వం ఆమోదించిన చట్టాన్ని ఇటీవల సుప్రీంకోర్టు తన ప్రత్యేక అధికారాలతో ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం తమిళనాడు ప్రభుత్వం వైస్ ఛాన్సలర్ల నియామకానికి సంబంధించిన చట్టాలను అధికారిక గెజిట్‌లో ప్రచురించింది. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ తిరునల్వేలికి చెందిన వెంకటాచలపతి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ లక్ష్మీనారాయణన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది పీఎస్ రామన్ వాదనలు వినిపిస్తూ.. పూర్తి వివరాలు ఇచ్చేందుకు తగిన సమయం కావాలని కోరారు. చట్టాలు గెజిట్ చేయబడిన తర్వాత, మొత్తం 10 వర్శిటీలకు కేవలం రెండు విశ్వవిద్యాలయాలకు మాత్రమే వీసీ సెర్చ్ కమిటీని నియమించామని, అర్హులైన వారు జూన్ 10వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరామన్నారు. అందువల్ల ఈ పిటిషన్‌పై స్పందించేందుకు కొంత సమయం కావాలన్నారు. అదే సమయంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది పి.విల్సన్ వాదనలు వినిపిస్తూ.. వీసీల నియామకానికి సంబంధించిన కేసు విచారణ సుప్రీంకోర్టులో సాగుతోందని, అందువల్ల సదరు కేసు సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఈ కేసును అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని, పిటిషనర్ ఓ రాజకీయ పార్టీకి చెందినవారు కావడంతో రాజకీయ ఉద్దేశాలతో పిటిషన్ దాఖలు చేశారన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాజకీయ శక్తుల నుంచి వర్శిటీలను రక్షించేందుకు ఈ పిటిషన్ దాఖలు చేశామని, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలు ఉల్లంఘించి చట్టం రూపొందించారని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వ న్యాయవాది పీఎస్‌రామన్ బదులిస్తూ.. బిల్లు రాష్ట్ర శాసనసభలో ఆమోదించబడిందన్నారు. సెర్చ్ కమిటీ నియామకం యూజీసీ అధికార పరిధిలో లేదని వివరించారు. యూజీసీ నియామకాల కంటే రాష్ట్ర ప్రభుత్వ చట్టమే బలమైనదని పేర్కొన్నారు. యూజీసీ నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందకపోవడంతో రాష్ట్రంలో వీసీల నియామకానికి సంబంధించిన నిబంధనల్ని నిరాకరిస్తూ 2021లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వ చట్టాలు చట్టవిరుద్ధం కావని, ఊహాగానాల ఆధారంగా చట్టాలను నిషేధించలేమన్నారు. వివరణాత్మక వాదనలు సమర్పించాల్సిన అవసరం ఉన్నందున, ప్రతిస్పందన దాఖలుకు రెండు వారాలు వ్యవధి ఇవ్వాలని కోరారు. యూజీసీ తరఫున హాజరైన అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ ఏఆర్ఎల్ సుందరేశన్ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ చట్టాలు యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఇరువర్గాల వాదనల అనంతరం చట్టం అమలుపై స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

రాష్ట్ర సరిహద్దుకు చేరుకున్న కృష్ణా జలాలు

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): కండలేరు రిజర్వాయర్ నుంచి ఈ నెల 5న విడుదలైన కృష్ణా జలాలు బుధవారం రాష్ట్ర సరిహద్దుకు చేరుకున్నాయి. తొలుత 500 ఘనపుటడుగులుగా విడుదల చేసిన నీటిని క్రమంగా 850 ఘనపుటడుగులకు పెంచారు. కండలేరు డ్యాం నుంచి విడుదల చేసిన నీరు సాధారణంగా ఐదారు రోజుల్లో రాష్ట్ర సరిహద్దులకు చేరుతుంది. ప్రస్తుతం వేసవి కారణంగా కాలువ పూర్తిగా ఎండిపోవడం, ఆంధ్ర రాష్ట్రంలోని రైతులు సాగునీరు తరలిస్తుండడంతో, రాష్ట్ర సరిహద్దులకు కృష్ణా జలాలు నిర్ణీత కాలంలో చేరుకోలేదు. ఈ విషయమై దృష్టిసారించి ఆంధ్ర రాష్ట్ర అధికారులు, సాయిగంగ కాలువలో విడుదల చేసిన కృష్ణా జలాలు అక్రమంగా తరలించరాదని రైతులను హెచ్చరించారు. దీంతో, బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో కృష్ణా జలాలు రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఊత్తుకోట సమీపంలోని తామరైకుప్పం జీరో పాయింట్‌కు చేరుకున్నాయి. అక్కడ నుంచి 25 కి.మీ దూరంలో ఉన్న పూండి జలాశయానికి గురువారం వేకువజామునకు చేరుకునే అవకాశముంది. ప్రస్తుతం రాష్ట్ర సరిహద్దుకు 50 ఘనపుటడుగుల నీరు వస్తోందని, రాబోయే రోజుల్లో నీటి రాక పెరిగే అవకాశముందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. కాగా, 35 అడుగులతో 3.231 టీఎంసీల సామర్థ్యం కలిగిన పూండి జలాశయంలో ప్రస్తుతం 1.361 టీఎంసీల నీటి నిల్వలుండగా, జలాశయానికి సెకనుకు 210 ఘనపుటడుగుల వరద నీరు వచ్చి చేరుతుంది.



జీరో పాయింట్‌కు చేరుకున్న కృష్ణా జలాలు

ఒకే ఒక్క తనిఖీతో పులకేసిగా ఎందుకు మారారు?

- ఎడప్పాడికి సీఎం స్టాలిన్ సూటి ప్రశ్న

అడయార్, మే 21 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామిపై ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ మరోమారు సెటైర్లు వేశారు. ఒకే ఒక్క ఈడీ తనిఖీతో పులకేశిగా మారడానికి కారణం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. ఇదే విషయంపై సీఎం స్టాలిన్ సోషల్ మీడియా ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'బీజేపీతో పొత్తేలేదని బల్లగుద్ది ప్రకటించిన నాలుక తడి ఆరిపోకముందే ఒకే ఒక ఈడీ సోదాతో పులకేశిగా మారి శ్వేత వర్ణ పతాకం చూపించిన పళనిస్వామి.. నేను తెల్లజెండా చూపించానంటూ వ్యాఖ్యానించడానికి సిగ్గు లేదా? ఈ స్టాలిన్ చేయి ఎల్లవేళలా నలుపు, ఎరుపు రంగుల్లో ఉండే పార్టీ జెండాను పట్టుకునే ఉంటుంది. పేరరిజ్ఞర్ చేతిని పట్టుకున్న చెయ్యి. ఎల్లవేళలా హక్కుల కోసం పోరాటం చేసిన జెండాను పట్టుకున్న చెయ్యి. ఎన్నటికీ వంగివంగి వెళ్లే వ్యక్తిని కాదు. రాష్ట్ర హక్కుల పరిరక్షణకు సుప్రీంకోర్టును ఆశ్రయించిన వ్యక్తిని. నిర్దేశించుకున్న లక్ష్యం కోసం ఎదురొడ్డి పోరాటే వ్యక్తిని. రాష్ట్రానికి రావాల్సిన నిధులను న్యాయపోరాటం చేసి పొంది తీరుతాం' అని స్టాలిన్ ప్రకటించారు.

14 జిల్లాల్లో ఫ్రెండ్స్ విమెన్ హాస్టళ్లు

రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో పనిచేస్తూ వర్కింగ్ ఉమెన్స్ కోసం ఫ్రెండ్స్ ఉమెన్స్ హాస్టళ్ళను ప్రభుత్వం నిర్మిస్తోంది. ఇందులోభాగంగా చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కోయంబత్తూరు, తిరుచ్చి, తంజావూరు, వేలూరు, సేలం, విల్లుపురం, తిరునెల్వేలి, పెరంబలూరు, పుదకోట, తూత్తుకుడితో సహా 13 జిల్లాల్లో నిర్మించిన ఫ్రెండ్స్ విమెన్ హాస్టళ్లను ప్రభుత్వం గతంలో నిర్మించింది. తాజాగా, చెన్నై, హోసూర్, తిరువణ్ణామలైల్లో రూ.38.15 కోట్ల తో 442 పడకలతో కూడిన ఫ్రెండ్స్ హాస్టళ్ల నిర్మాణం చేపట్టగా, వాటిని సీఎం స్టాలిన్ ప్రారంభించారు. అలాగే, తరమణి, చెప్పాక్కం, మదురై, కోయంబత్తూరు, నాగపట్టణం, కృష్ణగిరి, ఈరోడ్, కాంచీపురం, కడలూరు, ధర్మపురి, తేని, శివగంగై, రాణిపేట, కరూర్ జిల్లాల్లో రూ.176.93 కోట్లతో 2 వేల పడకల సౌకర్యంతో నిర్మించే ఈ హస్టళ్లకు శంకుస్థాపన చేశారు.



హాస్టళ్లకు శంకుస్థాపన చేస్తున్న సీఎం

తమిళనాడు, పుదుచ్చేరిలకు వర్షసూచన

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఈ నెల 25వ తేది వరకు వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉంటున్నా, కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. చెన్నై, నీలగిరి, తిరుచ్చి, వేలూరు జిల్లాల్లో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గి చల్లటి వాతావరణం నెలకొంటోంది. ఈ నేపథ్యంలో, నైరుతి రుతుపవనాలు మరో రెండు రోజుల్లో కేరళ రాష్ట్రంలో ప్రవేశించనున్నాయి. ఈ నేపథ్యంలో, వాతావరణంలో సంభవించిన మార్పుల కారణంగా తేని, దిండుగల్, తిరుప్పూర్, కోయంబత్తూర్, నీలగిరి, ఈరోడ్, కృష్ణగిరి, ధర్మపురి, తిరుపత్తూర్, వేలూరు తదితర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ తెల్లవారుజామున తేలిక పాటి వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.



తిరుత్తణి ప్రధాన వీధిలో కురుస్తున్న వర్షం

సమాచార దర్శిని

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, మే 21 (ఆంధ్రజ్యోతి): లైన్లలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా నగరంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు టీఎన్ఈబీ తెలిపింది. ఆవడి ప్రాంతంలోని చెక్‌పోస్ట్, ఎన్‌ఎం రోడ్డు, నందవన మెట్టూరు, కన్నికాపురం, తిరుమలరాజాపురం, హిందూ కాలేజ్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

మలేసియాలో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): మలేసియాలో వివిధ పనులకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని విదేశీ ఉద్యోగాల కల్పన సంస్థ పేర్కొంది. మలేసియాలో క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్, పైపింగ్ మరియు ప్లానింగ్ ఇంజనీర్, టెండరింగ్ ఇంజనీర్, పైపింగ్ ఫోర్‌మాన్, వెల్డర్లు, పైప్ ఫిట్టర్లు వంటి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. బీటెక్, బీఈ ఉత్తీర్ణులై 3 నుంచి 5 సంవత్సరాల అనుభవం కలిగి 24 నుంచి 42 ఏళ్లలోపున్న పురుషులు ovemclnm@gmail.com లో ఈనెల 29వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. వివరాలకు www.omcmanpower.tn.gov.inలో కానీ, నెం.044-2250 2267, 9566239685లలో సంప్రదించవచ్చు.

ఆర్ట్స్ కళాశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఈనెల 27వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. రాజధాని కళాశాలలో 2,380 సీట్లు, క్వీన్‌మేరీస్ కళాశాలలో 2,083, భారతి మహిళా కళాశాలలో 1,410, ఖాయితే మిల్లత్ కళాశాలలో 1,468 సహా 8 ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు చెన్నై జిల్లాలో పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కళాశాలల్లో విద్యా ఫీజుల నుంచి మినహాయింపు కల్పించడంతో పాటు 'పుదుమై పెన్', 'తమిళ్ ముదల్వాన్' సహా పలు పథకాలు అమలు చేస్తామన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సులకు ఈనెల 27వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు నెం.044-24343106, 24342911లలో సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

అనుమతి లేని వైద్య కళాశాలల్లో చేరొద్దు

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని వైద్య కళాశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోరాదని, విదేశాల్లో కోర్సు పూర్తిచేసి, భారత్‌లో వైద్య చికిత్సలు అందించవచ్చు అంటూ చెబుతున్న మాటలు నమ్మరాదని జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) హెచ్చరించింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి రాఘవ్‌లంగర్ ప్రకటన విడుదల చేశారు. వైద్య కోర్సులు ప్రారంభించాలంటే ఎన్‌ఎంసీ అనుమతి తప్పనిసరి అన్నారు. కానీ కొన్ని కళాశాలలు అనుమతులు లేకున్నా విద్యార్థుల అడ్మిషన్లు చేపట్టినట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అలాంటి కళాశాలల్లో విద్యార్థులు చేరడం చట్టరీత్యా చెల్లదని తెలిపారు. అంగీకారం లేని కళాశాలలు, వైద్య కోర్సుల్లో చేరాలని ఎవరైనీ సంప్రదిస్తే ug@nmc.org.inlZ కానీ, నెం.011-25367033లో ఫిర్యాదు చేయాలని ఎన్‌ఎంసీ తెలియజేసింది.

ఖైదీల వద్ద కుల ప్రస్తావన వద్దు

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): జైలు ఖైదీలను కులం గురించి అడగడం, కులం ఆధారంగా పనులు అప్పగించడం తదితరాలు చేయరాదని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. జైళ్ల విధివిధానాల్లో సవరణ చేపట్టిన ప్రభుత్వం ఈ మేరకు జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, జైళ్లకు కొత్త ఖైదీలు వచ్చినప్పుడు, వారి కులానికి సంబంధించిన వివరాలు జైలు అధికారులు అడగరాదు, రిజిస్టర్‌లో నమోదుచేయరాదు. కులం ఆధారంగా ఖైదీలకు గదులు కేటాయించడం, కులం ఆధారంగా పనులు అప్పగించడం తదితరాలు చేయరాదు. జైళ్లలోని బాత్రూమ్, టాయిలెట్లు ఖైదీలతో శుభ్రం చేయించరాదని, అందుకు యంత్రా లు వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

డీఎంకే కౌన్సిలర్ బహిష్కరణ

అడయార్, మే 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై కార్పొరేషన్ 65వ వార్డు డీఎంకే కౌన్సిలర్ శారదపై పార్టీ అధిష్ఠానం బహిష్కరణ వేటు వేసింది. కొళత్తూరుకు చెందిన ఈమె.. డీఎంకే మహిళా సోషల్ మీడియా విభాగ ఇన్‌చార్జి. అయితే, ఈమెపై పార్టీ అధిష్ఠానానికి అనేక ఫిర్యాదులు వెళ్ళాయి.ఈనేపథ్యంలో ఆమెను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ బుధవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా, పార్టీకి చెడ్డ పేరు తెచ్చేలా నడుచుకున్న కౌన్సిలర్ శారదను పార్టీలోని అన్ని బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

కరోనా లక్షణాలుంటే క్వారంటైన్

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): కరోనా లక్షణాలు నిర్ధారణ అయిన వారు వారం రోజులు క్వారంటైన్‌లో ఉండాలని ఆరోగ్య శాఖ సూచించింది. సింగపూర్, హాంకాంగ్ దేశాల్లో కొద్దిరోజులుగా కరోనా వ్యాప్తి అధికంగా ఉంటోంది. దేశంలోను కరోనా వ్యాప్తి ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ, ప్రపంచ ఆరోగ్య సంస్థలు ప్రకటించాయి. అదే సమయంలో, దేశంలో వ్యాపిస్తున్న కరోనా వైరస్ తీవ్రం కాకపోయినా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్య శాఖ సూచించింది. రాష్ట్రంలో చెన్నై సహా పలు నగరాల్లో రెండు వారాలుగా జ్వరం, దగ్గు, జలుబు తదితర సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం వ్యాపిస్తున్న కరోనా వైరస్ ఒమైక్రాన్ రకం వైరస్‌గా మార్పు చెందిందని, స్వీయ జాగ్రత్తలు పాటిస్తే మంచిదని సూచిస్తున్న వైద్యులు.. అలాంటి లక్షణాలు ఉన్న వారు వారంరోజులు తమ ఇళ్లలోనే క్వారంటైన్‌లో ఉండాలని, జ్వర తీవ్రత అధికంగా ఉంటే ఆస్పత్రులకు వెళ్లాలని వారు సూచిస్తున్నారు.

ప్రజా గ్రీవెన్స్‌కు 26 వినతులు

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లోని నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. గ్రేటర్ చెన్నై నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్ పోలీసుల సమస్యలు తెలుసుకునేలా ప్రతి మంగళవారం, ప్రజల సమస్యలు తెలుసుకునేలా ప్రతి బుధవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ గ్రీవెన్స్‌లో కమిషనర్ అరుణ్ స్వయంగా పాల్గొని పోలీసు అధికారులు, మహిళా పోలీసులు, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తుంటారు. ఈ నేపథ్యంలో, బుధవారం జరిగిన ప్రజా గ్రీవెన్స్‌లో 26 వినతిపత్రాలు స్వీకరించిన కమిషనర్, సమస్యలను సత్వరం విచారించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను ఆదేశించారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నగర పోలీస్ కమిషనర్ అరుణ్

వైభవంగా గంగమ్మ జాతర

వేలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపం బ్రహ్మపురంలో గంగమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది వేడుకల్లో భాగంగా ఆలయ గర్భగుడిలోని గంగమ్మ అమ్మవారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, మహా దీపారాధన నిర్వహించారు. అనంతరం అమ్మవారి శిరస్సును ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి చండాళీశ్వరి శరీరంపై శిరస్సు ఉంచి ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం అమ్మవారి నేత్రాలు తెరిచి మహా దీపారాధనలు చేశారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



గంగమ్మ శిరస్సు ఊరేగింపు

ఈవీఎంల పరిశీలన

వేలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ప్రత్యేక గదిలో భద్రపరిచిన ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)లను బుధవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి పరిశీలించారు. కాంగ్రెస్, బీజేపీ, డీఎంకే, అన్నాడీఎంకే సహా పలు పార్టీల నేతలు, కలెక్టర్ పీఏ (జనరల్) ముత్తయ్యన్, ఎన్నికల తహసీల్దార్ సత్యమూర్తి తదితరులున్నారు.



ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూం వద్ద కలెక్టర్ సుబ్బులక్ష్మి, రాజకీయ పార్టీల ప్రతినిధులు

విజేతలకు బహుమతుల ప్రదానం

వేలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తంలో క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతి పంపిణీ బుధవారం జరిగింది. కార్యక్రమానికి జిల్లా క్రీడాభివృద్ధి శాఖ డిప్యూటీ ఆర్గనైజర్ సురేష్‌బాబు అధ్యక్షత వహించగా, ఆర్గనైజర్ మనోహరన్ ఆహ్వానించారు. ముఖ్యఅతిథిగా ఆనైకట్టు డీఎంకే ఎమ్మెల్యే నందకుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు, కప్‌లు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అధ్యక్షుడు సౌందర్‌రాజన్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ఎమ్మెల్యే నందకుమార్‌తదితరులు

మద్యం దుకాణం వద్దు

తిరుత్తణి, మే 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకాలోని పట్టాభిరామాపురం పంచాయతీలో టాస్మాక్ మద్యం దుకాణాన్ని ప్రారంభించొద్దంటూ గ్రామస్థులు బుధవారం నిరసన తెలిపారు. పట్టాభిరామాపురం పంచాయతీలో అనుమతి లేకుండా ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్న టాస్మాక్ మద్యం దుకాణాన్ని వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ, పంచాయతీ కార్యాలయం ఎదుట పీఎంకే మండల అధ్యక్షుడు విజయన్ నేతృత్వంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ... మద్యం దుకాణాన్ని ప్రారంభించొద్దంటూ ఈనెల 19న అధికారులకు వినతిపత్రాన్ని అందజేశామన్నారు. అధికారులు దాన్ని బుట్టదాఖలు చేశారన్నారు. ఇప్పటికైనా టాస్మాక్ మద్యం దుకాణ ఏర్పాటు నిర్ణయం వెనక్కితీసుకోవాలని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సమాచారం అందుకుని ఘటనా చేరుకున్న పోలీసులు.. టాస్మాక్ అధికారలుతో మాట్లాడి పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వగా వారు నిరసన విరమించారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రాష్ట్రంలో ఆధునికీకరించిన 8 రైల్వే స్టేషన్లను ప్రారంభించనున్న ప్రధాని

అడయార్, మే 21 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 103 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించగా వాటిని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈనెల 22న గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. వీటిలో తమిళనాడులో రాష్ట్రంలో సెంట్ థామస్ మౌంట్, సామల్‌పట్టి, చిదంబరం, తిరువణ్ణామలై, మన్నార్‌కుడి, శ్రీరంగం, విరుదాచలం, కుళిత్తురై స్టేషన్‌లతో పాటు తిరుపతి జిల్లాలోని సూళ్ళూరు పేట స్టేషన్ కూడా ఉంది. అమృత్ భారత్ ప్రాజెక్టు కింద దక్షిణ రైల్వే పరిధిలో 90 రైల్వే స్టేషన్లు, చెన్నై డివిజన్ కింద 17 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించాలని నిర్ణయించారు. వీటిలో ఎనిమిది స్టేషన్ల ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. సెంట్ థామస్ రైల్వే స్టేషన్‌ను రూ.11.5 కోట్లతో, సామల్‌పట్టి స్టేషన్‌ను రూ.8 కోట్లతో, శ్రీరంగం స్టేషన్‌ను రూ.6.77 కోట్లతో, చిదంబరం స్టేషన్‌ను రూ.5.96 కోట్లతో, విరుదాచలం స్టేషన్‌ను రూ.9.17 కోట్లతో, కుళిత్తురై స్టేషన్‌ను రూ.5.35 కోట్లతో ఆధునికీకరించారు.

మా వృత్తిలో జోక్యం వద్దు!

● కలెక్టర్లకు టీచర్ల సంఘం హితవు

ప్యారీస్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్ల వృత్తిలో జోక్యం చేసుకోవద్దంటూ తమిళనాడు పీజీ టీచర్ల సంఘం కలెక్టర్లకు హితవు పలికింది. విరుదునగర్‌లో బుధవారం ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకరన్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో ఏడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. డీఎంకే తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన పాత పింఛన్ పథకాన్ని నాలుగేళ్లుగా అమలు చేయలేదన్నారు. జూన్ 3న పాఠశాల పునఃప్రారంభం రోజు ప్రధానోపాధ్యాయులు లేకుండా ఏ పాఠశాల పనిచేయని పరిస్థితి రాకుండా వ్యవహరించాలన్నారు. పీజీ టీచర్ల బదిలీ కౌన్సెలింగ్‌ను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్లస్‌వన్, ప్లస్‌టూ విద్యార్థులకు కూడా పౌష్టికాహార పథకాన్ని వర్తింపజేయాలని, టెన్త్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకుండా మళ్లీ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు చెల్లించాలని కోరారు. అన్ని జిల్లాల్లో ప్లస్‌వన్, ప్లస్‌టూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్ పనుల్లో జిల్లా కలెక్టర్ల జోక్యం అధికంగా ఉందని, వచ్చే విద్యాసంవత్సర నుండి ఈ పరిస్థితి రాకుండా చూసుకోవాలని ఆయన రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీచర్ల సంఘ అధ్యక్షుడు ప్రభాకరన్

క్వారీలు తనిఖీ చేయండి

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగ క్వారీలను తనిఖీ చేయాలని భూగర్భ వనరుల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. శివగంగ జిల్లా సింగంపునారి సమీపంలోని క్వారీ వద్ద రాళ్లు కూలడంతో ఐదుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనపై స్పందించిన భూగర్భ వనరుల శాఖ, రాష్ట్రవ్యాప్తంగా క్వారీలు తనిఖీ చేయాలని ఆదేశించింది. క్వారీల్లో భద్రతా విధానాలు సక్రమంగా పాటిస్తున్నారా? క్వారీలో పనిచేసే కార్మికులకు తగిన భద్రత పరికరాలు అందజేస్తున్నారా? అనే విషయాలు స్వయంగా పరిశీలించి నివేదిక దాఖలు చేయాలని జిల్లా అధికారులకు ఖనిజ వనరుల శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



వేలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పేర్నాంబట్టులో వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. బజారు వీధిలో బుధవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి సమాజ సేవకుడు మహమ్మద్ ఇమ్రాన్, వ్యాపారుల సంఘం జిల్లా కోశాధికారి అరియార్ అమీన్ అహ్మద్ అధ్యక్షత వహించారు. వ్యాపారుల సంఘ నగర సెక్రటరీ రవీంద్రన్, కోశాధికారి రెహ్మాన్‌తో పాటు సంఘ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆదవ్ అర్జునకు ఆ అర్హత లేదు

● అన్నాడీఎంకే ఐటీ వింగ్

అడయార్, మే 21 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే, బీజేపీ కూటమిపై విమర్శలు గుప్పించే అర్హత టీవీకే నేత ఆదవ్ అర్జునకు లేదని అన్నాడీఎంకే ఐటీ వింగ్ ఒక ప్రకటనలో పేర్కొంది. పారిశ్రామికవేత్తగా ఉన్న ఆదవ్ అర్జున.. రాత్రికి రాత్రే రాజకీయ నేతగా మారిపోయి, పార్టీలు మారడంలో ఆరితేరిపోయారని, అలాంటి వ్యక్తికి తమ పార్టీ గురించో, అన్నాడీఎంకే - బీజేపీ గురించో మాట్లాడే అర్హత లేదని ఆ విభాగం ప్రతినిధులు పేర్కొన్నారు.

మా మధ్య మనస్పర్థల్లేవు

● రాందాస్

అడయార్, మే 21 (ఆంధ్రజ్యోతి): తమ మధ్య మనస్పర్థలు లేవని, త్వరలోనే అన్బుమణి వచ్చి తనను వచ్చి కలుస్తాడని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ అన్నారు. ఈ విషయంపై ఆయన బుధవారం దిండివనంలో విలేకరులతో మాట్లాడుతూ, వన్నియర్లకు 10.5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయనున్నట్టు ఆయన తెలిపారు. మరోవైపు, పీఎంకేలో నెలకొన్న రాజకీయ సంక్షోభంపై పీఎంకే గౌరవ అధ్యక్షుడు జీకే మణి మాట్లాడుతూ, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఆయన తనయుడు, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ మధ్య ఎలాంటి విభేదాలు లేవని, వారిద్దరూ త్వరలోనే సమావేశమై అన్ని విషయాలు చర్చించుకోనున్నారని వెల్లడించారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ



పారిశుధ్య కార్మికులతో జీకేఎం అరిమా సంఘం చైర్మన్ జీఆర్ వెంకటేష్, ఫాదర్ చార్లెస్‌కుమార్ తదితరులు

ప్యారీస్, మే 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీకేఎం అరిమా సంఘం వార్షికోత్సవం సందర్భంగా పేదలకు సంక్షేమ పథకం సహాయాలను పంపిణీ చేశారు. స్థానిక మహాకవి భారతినగర్‌లో బుధవారం ఉదయం అరిమా సంఘ చైర్మన్, టీఎంసీ ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెయింట్ సూసయ్యపుర్ చర్చి ఫాదర్ ఎంఎ చార్లెస్‌కుమార్, రేష్మ చారిటబుల్ ట్రస్ట్ మణివన్నన్, సుందరితో పాటు సంఘ నిర్వాహకులు, సభ్యులు పాల్గొని, పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేశారు.

తిరుత్తణి ప్రభుత్వాస్పత్రిలో పాము

తిరుత్తణి, మే 21 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి ప్రభుత్వాస్పత్రిలోని మహిళల టాయిలెట్‌లో పాము ఉండడాన్ని గమనించిన రోగులు, అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ ఆస్పత్రికి ప్రతిరోజు సుమారు 200 మంది రోగులు వస్తుంటారు. అవుట్ పేషంట్లు, రక్త పరీక్ష ఫలితాలు అందజేసే ప్రాంతానికి ఎదురుగా పురుషులు, మహిళలకు వేర్వేరు టాయిలెట్లు ఉన్నాయి. మహిళ టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో అక్కడ పాము ఉండడం గమనించి కేకలు వేస్తూ బయటకు వచ్చింది. ఆస్పత్రి సిబ్బంది సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని ఐదు అడుగుల పామును బంధించారు.

తీర ప్రాంతాలకు వెళ్లొద్దు

వేలూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని నదులు, చెరువుల్లో నీటి నిల్వలు పెరిగాయని, ఆ ప్రాంతాలకు ప్రజలు వెళ్లరాదని కలెక్టర్ సుబ్బులక్ష్మి తెలిపారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు, బాల బాలికలు సరదాగా ఈత కొట్టేందుకు, స్నానాలు చేసేందుకు జలాశయాల వద్దకు వెళుతుంటారన్నారు. ప్రస్తుతం జలశయాల్లో నీటి నిల్వలు పెరుగుతుండడంతో నీట మునిగి మృతి చెందే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల జలాశయాల వద్దకు వెళ్లరాదని, పిల్లలు ఆ ప్రాంతాలకు వెళ్లకుండా పెద్దలు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తె సహా ముగ్గురి మృతి

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన చెట్టును కారు ఢీకొన్న ఘటనలో తండ్రీకుమార్తె సహా ముగ్గురు మృతిచెందారు. కన్నియకుమారి జిల్లా అగస్తీశ్వరం సూరకుడి దక్షిణ వీధికి చెందిన బాలప్రభు (28) భార్య గౌరి (26) డాక్టర్‌గా పనిచేస్తోంది. ఈ దంపతులు తమ కుమార్తె కవిత(2)తో కలిసి చెన్నైలో నివసిస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో బాలప్రభు కుటుంబంతో కలసి స్వగ్రామం అగస్తీశ్వరానికి వెళ్లాడు. జూన్ 2వ తేది నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, మంగళవారం రాత్రి బాలప్రభు, భార్య, కుమార్తె, మామ కందస్వామి(50)తో కలసి కారులో చెన్నైకి బయల్దేరాడు. బాలప్రభు నడుపుతున్న కారు బుధవారం వేకువజామున తిరుచ్చి-చెన్నై జాతీయ రహదారిలోని పెరంబలూరు జిల్లా పాడలూరు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో బాలప్రభు, కందస్వామి ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్రంగా గాయపడి కవిత, గౌరిని చుట్టుపక్కల వారు రక్షించి పెరంబలూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో కవిత మృతిచెందింది. ఘటనపై పాడలూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



నుజ్జునుజ్జైన కారు

నీట మునిగి ముగ్గురు బాలుర మృతి

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లాలో నీటమునిగి ముగ్గురు బాలురు మృతిచెందారు. అరసురై గ్రామానికి చెందిన అభినయ(15), శివశంకరి(20), తట్టపాళయానికి చెందిన రాజేష్ (15) బుధవారం ఉదయం అదే ప్రాంతంలోని నదిలో స్నానాలకు వెళ్లారు. ఆనందంగా జలకాలాడుతున్న ముగ్గురు ఊహించని విధంగా లోతైన ప్రాంతానికి వెళ్లారు. ఈత రాకపోవడంతో ముగ్గురు మునిగిపోయారు. గమనించిన చుట్టుపక్కల వారు నదిలో గాలించి ముగ్గురు మృతదేహాలు వెలికితీశారు. మృతుల్లో అభినయ, శివశంకరి అక్కాచెల్లెళ్లు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదు చేశారు.

నగల కోసం మహిళ దారుణహత్య

పెరంబూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా కడయాంపట్టి సమీపంలోని ఆవులను మేతకు తీసుకెళ్లిన మహిళను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చి నగలు దోచుకెళ్లారు. కడయాంపట్టి సమీపం చిన్నేరికాడుకు చెందిన సరస్వతి (68) భర్త మృతిచెందగా, రాజా, మురుగానందం అనే ఇద్దరు కుమారులున్నారు. ఇద్దరు కుమారులకు వివాహమై వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, మంగళవారం సాయంత్రం ఆవులను మేత కోసం తమకు సొంతమైన పొలంలోకి తీసుకెళ్లిన సరస్వతి రాత్రి 8 గంటలైనా ఇంటికి రాలేదు. ఆమె కోసం బంధువులు పొలంలోకి వెళ్లి చూడగా, తలపై బలమైన గాయంతో తీవ్ర రక్తగాయాలతో సరస్వతి మృతిచెంది పడి ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెందారు. అలాగే, సరస్వతి చెవులకు ఉన్న కమ్మలు, ముక్కుపుడక తదితరాలను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న దీవట్టిపట్టి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని డీఐజీ ఉమ, ఏడీఎస్పీ సోమసుందరం, డీఎస్పీ సంజీవ్‌కుమార్ పరిశీలించారు. నిందితుల ఆచూకీకి నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు డీఐజీ ఉమ తెలిపారు.



సరస్వతి (ఫైల్‌ఫొటో)

హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

అడయార్, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణి ఎంఆర్‌టీఎస్ రైల్వే స్టేషన్ వద్ద హెడ్ కానిస్టేబుల్ శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని పేరు సెందిల్‌గా గుర్తించారు. తరమణి పోలీస్ స్టేషన్‌లో ఈయన హెడ్ కానిస్టేబుల్. ఆయన మంగళవారం సాయంత్ర సివిల్ దుస్తుల్లో కారు నడుపుకుంటూ గిండి వంతెన వద్ద వెళుతుండగా, ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మోటరిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత కూడా కారును ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. దీన్ని చూసిన ఇతర వాహనదారులు అడ్డుకుని కత్తిప్పార జంక్షన్ వద్ద పట్టుకున్నారు. ఆ సమయంలో ఆయన ఫూటుగా మద్యం తాగినట్టు గుర్తించారు. ఆ తర్వాత గిండి ట్రాఫిక్ ఇంటెలిజెన్స్ పోలీసులకు అప్పగించగా, ఆయనపై మూడు కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తరమణి ఎంఆర్‌టీఎస్ రైల్వే స్టేషన్ సమీపంలోకి ఒంటరిగా వెళ్ళి, శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చే సమయానికి సెందిల్ శరీరం పూర్తి కాలిపోయి ప్రాణాలు విడిచాడు. దీంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు.

జిల్లా టాపర్లను అభినందించిన కలెక్టర్



సెల్వశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, మే 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా స్థాయిలో టెన్త్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను కలెక్టర్ ప్రతాప్ అభినందించారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి తాలూకా కార్యాలయంలో బుధవారం జమాబందీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతాప్ పాల్గొని, ప్రజల నుంచి సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందుకున్నారు. ఇళ్ల పట్టాలు, ఇంటి స్థలం, కొత్త రేషన్ కార్డులు, కుల ధృవీకరణ పత్రాలు సహా పలు సమస్యలపై ప్రజలు అందజేసిన వినతిపత్రాలను సత్వరం విచారించిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి పరీక్షల్లో 495 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన అత్తిమాంజేరిపేటకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి మణిమారన్, 494 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన సెల్వశ్రీని కలెక్టర్ అభినందించారు.



వైభవంగా గంగమ్మ జాతర

తిరుత్తణి, మే 21 (ఆంధ్రజ్యోతి): పళ్లిపట్టు గ్రామ దేవత కొల్లాపురి అమ్మవారి ఆలయ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకారంలో పుష్పాలతో అలకరించిన వాహనంలో మేళతాళాల నడుమ ఊరేగించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, మహా దీపారాధనలు నిర్వహించారు. గురువారం కూడా జాతర నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు అమ్మవారికి అంబలి సమర్పించారు.



అద్దె చెల్లించని దుకాణం సీజ్

తిరుత్తణి, మే 21 (ఆంధ్రజ్యోతి): షోళింగర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ స్థలంలో ఉన్న దుకాణానికి అద్దె చెల్లించకపోవడంతో అధికారులు సీజ్ చేశారు. మేనక పేరుతో నడుపుతున్న వస్త్ర దుకాణానికి సంబంధించి అద్దె బకాయిలున్నాయి. ఈ విషయమై అధికారులు పలుమార్లు నోటీసులు అందించినా స్పందించక పోవడంతో బుధవారం ఉదయం దేవాదాయ శాఖ వేలూరు అసిస్టెంట్ కమిషనర్ శంకర్, షోళింగర్ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజా, నెమిలి సర్క్యూట్ ఇన్‌స్పెక్టర్ ప్రియ, రెవెన్యూ శాఖ అధికారులు పోలీసులతో అక్కడకు వెళ్లి దుకాణాన్ని సీజ్ చేశారు.

